సాక్షి చిత్తూరు

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలిపివేయాలి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలిపివేయాలని నిరసన చేపట్టారు. - IIలో



కిక్కిరిసిన గోవిందరాజులగుట్ట

పెరటాసి నెలను పురస్కరించుకొని గోవిందరాజుల గుట్టకు శనివారం భక్తులు పోటెత్తారు. - IIలో



ఆగని ఏనుగుల దాడులు

పంట పొలాలపై ఏనుగుల దాడి కొనసాగుతోంది. శనివారం పంటలపై పడి బీభత్సం సృష్టించాయి. - IIలో

హోమ పూజల్లో పాల్గొని పూర్ణాహుతి చేస్తున్న ఈఓ, ఉభయదారులు



శాకాంబరీదేవి అలంకరణలో అమ్మవారు



శాకాంబరీగా బోయకొండ గంగమ్మ

దసరా మహోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన శనివారం బోయకొండ గంగమ్మ శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పాలిట కొంగు బంగారమై అమ్మవారు ప్రసిద్ధి కెక్కారు. పట్టుపీతాంబరాలు, రంగు రంగుల పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో పాటు కూరగాయలతో శాకాంబరిగా కొలువు దీర్చారు. అమ్మవారి ఉత్సవమూర్తికి ఈఓ ఏకాంబరంతో పాటు ఉభయదారులచే అమ్మవారికి ప్రత్యేక హోమ పూజలతో పాటు పూర్ణాహుతి చేశారు. - చౌడేపల్లె

కృష్ణాలంకృతుడై..తృష్ణవల్లభుడై..!

ఓ పక్క రుక్మిణి..మరో పక్క సత్యభామ.. మురళీలోలుడు బకాసురుడిని వధిస్తూ భక్తులకు కనువిందు చేశారు. స్వర్ణతేజోమయంగా కాంతులీనుతున్న సర్వభూపాలుడిని అధిరోహించిన స్వామి సకల భూపాలురకు తానే అధిపతినని.. తన భక్తే రాజ్యాధికారమని సందేశమిచ్చారు. అంతకుముందు కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షంపై రాజమన్నార్ అవతారంలో వచ్చి భక్తులకు అభయమిచ్చారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన శనివారం కల్పవృక్ష, సర్వభూపాల వాహనసేవలు నిర్వహించారు. తిరుమాడ వీధుల్లో భక్తులు మలయప్పను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. వాహనసేవల ముందు కళాప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. - తిరుమల



కల్పవృక్ష వాహనసేవలో పాల్గొన్న భక్త జనం (ఇన్‌సెట్) కల్పవృక్షవాహనంపై మలయప్పస్వామి



సర్వభూపాల వాహనంపై మలయప్ప స్వామి



వాహనసేవలో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

న్యూస్‌రీల్

టీటీడీకి 12 టన్నుల కూరగాయల వితరణ



కూరగాయల వాహనాలకు పూజలు చేస్తున్న దృశ్యం

పలమనేరు : తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టణంలోని గంటావూరుకు చెందిన శ్రీవారి భక్తుడు మురుగన్ 12 టన్నుల కూరగాయలను టీటీడీ అన్నదాన సత్రానికి శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీవారి సేవకులు కాబ్బల్లి రవీంద్రారెడ్డి దాతను అభినందించారు. ఆ మేరకు కూరగాయలు నింపిన ప్రత్యేక వాహనానికి పూజలు నిర్వహించి గోవింద నామస్మరణాల మధ్య తిరుమలకు ఇక్కడి నుంచి తరలించారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలో వంద శాతం గర్భిణుల నమోదు చేపట్టాలని, అలాగే ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 12 వారాలకే గర్భిణుల నమోదు చేయాలన్నారు. ఇప్పటికి 80 శాతం మాత్రమే పూర్తి అయ్యిందన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలకు ఆధార్ కార్డుతో అనుసంధానం ఉందా లేదా అని పరిశీలించాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ పద్మాంజలి పాల్గొన్నారు.

పుంగనూరు : నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కూటమి అరాచకాలను ఎండగడుదాం

కూటమి అరాచకాలను ఎండగట్టేందుకు వైఎస్సార్‌సీపీ నడుంబిగించింది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల సైన్యాన్ని సిద్ధం చేసేందుకు ఉపక్రమించింది. శనివారం పుంగనూరు నియోజకవర్గం సదుం మండలంలోని ఎర్రాతివారిపల్లెలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రెడ్‌బుక్ ఆగడాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయించి చట్టం ముందు నిలబెట్టే చర్యలకు శ్రీకారం చుట్టనున్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి, తిరిగి జగనన్న పాలనను తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రతి నెలా 'జగనన్న'తో ముఖాముఖి'

- పుంగనూరు నుంచే కార్యక్రమం ప్రారంభం
- గ్రామస్థాయి నుంచే కమిటీలు ఏర్పాటు
- ఎర్రాతివారిపల్లె విస్తృత స్థాయి సమావేశం
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేసుకుంటూ కార్యకర్తలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించే కార్యక్రమాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి జైలు నుంచి రాగానే పుంగనూరు నుంచి ప్రారంభిస్తారని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పార్టీకి 18 లక్షల మంది క్రియాశీలక సైన్యం ఉందని ధీమా వ్యక్తం చేశారు. పుంగనూరు నియోజకవర్గం, సదుం మండలం, యర్రాతివారిపల్లెలో శనివారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన పుంగనూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఇంకా తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రి నారాయణస్వామి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నిసార్ అహ్మద్, వెంకటేగౌడ్, డాక్టర్ సునీల్‌కుమార్, విజయానందరెడ్డి, నూకతోటి రాజేష్, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

• కమిటీలకే పూర్తి బాధ్యత

అనంతరం వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడారు. 'పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేశాం. గ్రామ కమిటీలకే పూర్తి బాధ్యత. పుంగనూరు నియోజకవర్గంలోని 112 గ్రామాల పార్టీ కార్యకర్తలు, నాయకులతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. ఎంపీ మిథున్‌రెడ్డి జైలు నుంచి వచ్చాక ఈ కార్యక్రమం ఉంటుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డిజిటల్ నోట్‌బుక్‌లో అన్ని విషయాలు నమోదు చేసుకోవచ్చు' అని అన్నారు.

• పొరబాట్లు జరగనివ్వను

ఆకేపాటి అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. 'గతంలో జరిగిన పొరపాట్లు ఈ సారి జరగనివ్వను. ఈసారి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక మీ ద్వారానే ప్రభుత్వం నడవనుంది' అని చెప్పారు.

• విద్య, వైద్యం నిర్వీర్యం

మాజీ మంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ.. 'ఈవీఎంల గాలిలో కూడా పుంగనూరు ప్రజలు పెద్దిరెడ్డిని గెలిపించారు. మీరు జగనన్న సైనికులు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్యాన్ని నిర్వీర్యం చేసింది' అని ధ్వజమెత్తారు. రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాకు ఆదర్శం. కార్యకర్తలను ఏ విధంగా చూసుకోవాలో పెద్దిరెడ్డే నిదర్శనం. మనం పుంగనూరుని రోల్‌మోడల్‌గా తీసుకుందాం. మా నియోజకవర్గంలో కూడా ఇదే ఫార్ములాను అమలు చేస్తాను' అని పేర్కొన్నారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, పెద్దిరెడ్డి, కొండవీటి నాగభూషణం, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటేగౌడ, సునీల్, కురుముట్ల శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డితో పాటు ఆకేపాటి అమరనాథరెడ్డి, సమన్వయకర్తలు నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి, రాజేష్, విజయానందరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్‌షరీఫ్ పాల్గొన్నారు.

దోచుకుంటున్న కూటమి

ముందుగా సజ్జల మాట్లాడుతూ..'ప్రజలకు సంక్షేమం అందించడమే అజెండాగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగింది. సంస్థాగతంగా పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాం. భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. కార్యకర్తల పాత్ర ప్రత్యక్షంగా ఉంటుంది. వైఎస్ జగన్ చేసే యజ్ఞంలో మనం క్రియాశీలక పాత్రదారులం కావాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని దోచుకుంటోంది. ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ మేము ఉన్నాము అని చెప్తున్నారు' అని అన్నారు. ఓట్లను తొలగించడం, వ్యవస్థలను మేనేజ్ చేయడం చంద్రబాబుకు తెలుసు. ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్త అప్రమత్తంగా ఉండాలి. బూత్ లెవల్‌లో నిత్యం పరిశీలిస్తూ ఉండాలి. ఎల్లో మీడియా, సోషల్ మీడియా గ్లోబల్ ప్రచారం చేస్తున్నారు. వ్యక్తిగతంగా దాడికి రెడ్ బుక్ ఉపయోగించారు. మనం డిజిటల్ బుక్‌ను లాంచ్ చేశాం' అని చెప్పారు.

కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యం

భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ..'రాష్ట్రంలో అన్ని కమిటీలు నియమించిన మొట్టమొదటి నియోజకవర్గం పుంగనూరు నియోజకవర్గం. రాబోయే జగనన్న ప్రభుత్వంలో కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యం. జగనన్న మాటగా గ్రామస్థాయిలో తీసుకు వెళ్లాల్సిన బాధ్యత మీపై ఉంది' అని అన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి , చిత్రంలో సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కాసుల 'గుట్టలు'

జిల్లాలో అక్రమ క్వారీలు సవారీ చేస్తున్నాయి. మైనింగ్ అనుమతులకు తూట్లు పొడుస్తున్నారు. కూటమి నేతలు కసితీరా గుట్టలను కొల్లగొట్టి దోచేస్తున్నారు. అక్రమాలకు కూటమిలోని కొందరు బడా నేతలు, ప్రజాప్రతినిధులు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలిచారు. వీరిచ్చే అనుమతులకు ప్రతిఫలంగా లక్షలు జేబులోకి వెళ్తోంది. దీనిపై మైనింగ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమిలోని సీనియర్ నేతలు మైనింగ్ మాఫియా విషయాన్ని సీఎం చెంతకు తీసుకెళ్లారనే విషయం జిల్లాలో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

జిల్లాలో ఆగని అక్రమ క్వారీలు

- మైనింగ్ అనుమతులకు తూట్లు
- ప్రజాప్రతినిధుల అనుమతితో వెలుస్తున్న క్వారీలు
- ప్రతిఫలంగా రూ.లక్షలు ముట్టజెబుతున్న వైనం
- చోద్యం చూస్తున్న మైనింగ్ శాఖ అధికారులు
- దొంగ బిల్లుల వ్యవహారం సీఎం చెంతకు?
- చర్యలు తీసుకునేనా?



బంగారుపాళెం మండలంలో నడుస్తున్న అక్రమ క్వారీలు



సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లాలో 400 వరకు క్వారీలకు అనుమతులున్నాయి. వీటిలో చాలా క్వారీలు జోరుగా నడుస్తున్నాయి. ఇందులో 200 క్వారీలు కాసులు కుమ్మరిస్తున్నాయి. మిగిలిన వాటిలో కొన్ని నాసిరకం, క్రాక్‌లు, ఆర్థిక కష్టాల కారణంగా నిలిచాయి. మరికొన్ని మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. అయితే దీనికి దీటుగా అక్రమ క్వారీలు వెలుస్తున్నాయి. చిత్తూరు, గంగాధర నెల్లూరు, వెదురుకుప్పం, పాలసముద్రం, కుప్పం, ఎస్ఆర్‌పురం, యాదమరి, జీడీనెల్లూరులో విచ్చలవిడిగా కొండలు ఛిద్రమవుతున్నాయి. బంగారుపాళ్యంలో అధికారాన్ని అడ్డుపెట్టి ఎత్తులు వేశారు. దీంతో అక్కడ నల్లబంగారమే అక్రమ గనులకు రూ.కోట్లు తెచ్చి పెడుతున్నాయి.

అనుమతులు ఇలా....

క్వారీ నడపాలంటే తొలుత మైనింగ్ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. రెవెన్యూ, అటవీశాఖ అధికారుల నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలి. ఆ దరఖాస్తు మేరకు మైనింగ్ శాఖ అధికారులు సర్వే చేసి విజయవాడకు పంపుతారు. దీంతో అక్కడి నుంచి ఎల్‌ఓఐ (లెటర్ ఆఫ్ ఇండెంట్) వస్తుంది. అనంతరం మైనింగ్ ప్లానింగ్, ఈసీ, పొల్యూషన్ సర్టిఫికెట్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత డైరెక్టర్ నుంచి తదుపరి అనుమతులు వస్తాయి. డీడీకి గ్రాంట్ ఆర్డర్ వచ్చాక, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ఈ చెల్లింపుతో వర్క్ ఆర్డర్ ఇస్తారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి అయ్యేందుకు కనీసం మూడు నెలల నుంచి ఆరు నెలల సమయం పడుతుంది.

మామూళ్లు రూ.లక్షల్లో చేరిపోతున్నాయి

మైనింగ్ శాఖ చుట్టూ తిరగకుండా కొంత మంది కూటమి నేతలు అధికారపార్టీ బలాన్ని కొండలపై పెడుతున్నారు. మైనింగ్ శాఖ చట్టానికి, అనుమతులకు తూట్లు పొడుస్తున్నారు. కొందరు బడానేతలు, ప్రజాప్రతినిధుల నోటి మాటలే అనుమతులుగా మలిచి క్వారీలపై సవారీ చేస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఇందుకు ప్రతి ఫలంగా కొందరు ప్రజాప్రతినిధులు, బడానేతలకు రూ. లక్షల్లో క్వారీ కాసులు చేరుతున్నట్లు సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. క్వారీలో అడుగు పెట్టాలంటే రూ. 5 నుంచి రూ. 10 లక్షలు, రాళ్లు బయటపడితే నెలవారీ మామూళ్లు రూ. 20 నుంచి రూ. 30 లక్షల వరకు వెళుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇందులో ఓ మంత్రి పేరు సైతం వాడేస్తున్నారని ఆగ్రహానికి లోనవుతున్నారు. అడ్డొచ్చే వారికి, ఈ అక్రమ క్వారీల విషయాన్ని బయట పొక్కకుండా కాపాడేందుకు వివిధ శాఖ అధికారులకు నెలవారీ మామూళ్లు పంపుతున్నామని అక్రమ క్వారీ నిర్వాహకులు బహిరంగంగా చెప్పడం విమర్శలకు తావిస్తోంది. ఈ ప్రతిఫలంగా అధికారులు అక్రమ క్వారీ నిర్వాహకులను కంటికి రెప్పలా కాపాడుతున్నారని టీడీపీలోని ఓ వర్గం నేతలు గొంతు చించుకుంటున్నారు. అక్రమంపై ఫిర్యాదు చేస్తే.. ఆ క్వార్వీలకు దరఖాస్తులు పెట్టుకున్నారని అధికారులు తోసి పుచ్చుతున్నట్లు వారు మండిపడుతున్నారు. అక్రమ క్వారీ వ్యవహారంపై కలెక్టర్‌కు కూడా మైనింగ్ అధికారులు తప్పుడు నివేదికలు పంపుతున్నారని వాదిస్తున్నారు.

అనుమతులుంటే నష్టపోతున్నారు..

అక్రమ క్వారీలతో పక్కాగా అనుమతులు తీసుకుని క్వారీలు నడిపిస్తున్న వారు నష్టపోతున్నారు. అక్రమ క్వారీలకు గిరాకీ పెరగడంతో వారు ఆర్థికంగా చితికిపోతున్నారు. అక్రమ గ్రానైట్ తక్కువ రేటుకు లభించడంతో అక్రమ క్వారీలకు క్యూ కడుతున్నారు. అక్కడ తక్కువ రేటుకు కొనుగోలు చేస్తూ...అనుమతులతో నడిపిస్తున్న క్వారీపై పూర్తిగా ముఖం చాటేస్తున్నారు. అక్రమ క్వారీ నిర్వాహకులు గ్రానైట్ తరలింపునకు దొంగ బిల్లులు అంటగడుతూ..గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్వాహకులను బుట్టలో వేసుకుంటున్నారని జిల్లాలో జోరుగా చర్చ సాగుతోంది. దీని దెబ్బకు అనుమతులతో క్వారీ నడిపిస్తున్న వారు ఏకమయ్యారు. అక్రమ క్వారీలతో తమ కడుపు కాలుతోందని..వారంతా రాష్ట్ర నేతల వద్ద గోడు వెలబోసుకుంటున్నారు.

దొంగబిల్లుల రచ్చ...

చిత్తూరు కేంద్రంగా నడుస్తున్న దొంగ బిల్లుల వ్యవహారం రచ్చ కెక్కింది. ఈ వ్యవహారానికి మూల పురుషుడుగా రారాజేనని కూటమి నేతలు ముద్రవేశారు. సాక్షిలో వచ్చిన వరుస కథనాలను టీడీపీలోని నేతలే నిజమని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. ఈ వ్యవహారం సీఎం చంద్రబాబు దృష్టికి చేరినట్లు ఓ వర్గం కోడై కూస్తోంది. ఈ విషయాన్ని తొక్కే పడేయాలని కొందరు అధికారులు, రారాజు వర్గం విశ్వ ప్రయత్నాలు చేస్తోందని వ్యతిరేక వర్గం చెబుతోంది. ఈ వ్యవహారంపై చర్యలు ఉంటాయని చెబుతున్నారు.

ఆగని ఏనుగుల దాడులు


టమాట తోటను ధ్వంసం చేసిన ఏనుగులు

పులిచెర్ల (కల్లూరు) : పంట పొలాలపై ఏనుగుల దాడి నిరంతరం కొనసాగుతూనే ఉంది. తాజాగా శనివారం తెల్లవారుజామున మండలంలోని దిగువ మూర్తి వారిపల్లె, మిట్టమీద రాచపల్లె, మర్రి కుంట వారిపల్లె, పాళెం, కొంగరవారిపల్లె గ్రామాల్లోని పొలాల్లో ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. మిట్టమీద రాచపల్లెకు చెందిన సుధాకర్, ప్రభాకర్ పొలాల్లో వరి పంటను తొక్కి నాశనం చేశాయి. అలాగే కృష్ణారెడ్డికి చెందిన టమాట పంటను ధ్వంసం చేశాయి. దిగువ మూర్తి వారిపల్లెకు చెందిన సుధాకర్ పొలంలో మామిడితోటలో కొమ్మలను విరిచేశాయి. ఏనుగులు రాత్రి సమయంలో చుట్టు పక్కల పొలాలపై దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలిపివేయాలి

- కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ విభాగం నిరసన
- కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ప్రాంతాలకు చెందిన న్యాయవాదులు
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతిపత్రం అందజేత


కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేయాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. పీపీపీ పద్ధతిలో కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అప్పగించడం సబబు కాదని విమర్శించారు. 2019–2024 సంవత్సరాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 17 కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. వాటిలో 5 కళాశాలలు 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం అయినట్లు తెలిపారు. ఆ కళాశాల్లో 750 సీట్లతో మెడికల్ విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారన్నారు. జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలనే ఉద్దేశంతో గత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక మెడికల్ కళాశాలను స్థాపించారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు నిధుల కొరత అనే కుంటి సాకుతో ప్రారంభించకుండా ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 12 మెడికల్ కళాశాలలకు నిధులు కేటాయించకుండా కూటమి ప్రభుత్వం కుంటి సాకులతో ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల కాలంలో రెండు లక్షల కోట్లను అప్పుచేసి అమరావతి రాజధాని నిర్మాణానికి 70 వేల కోట్ల టెండర్లను పిలిచిందని విమర్శించారు. ప్రజలకు మేలు కలిగే 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించడం విఫలమైందని ఆరోపించారు.

కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పేందుకే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఎలాగైనా కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పాలనే కుట్రతోనే కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర లీగల్ సెల్ మెంబర్లు సుగుణశేఖర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. వారు మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు పాలనలో ఒక్క మెడికల్ కాలేజీని స్థాపించలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వం వ్యక్తిగత స్వాలాభం కోసం కుట్రలు చేసి ప్రైవేటీకరణ చేస్తోందని మండిపడ్డారు. నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను పూర్తి చేసేందుకు రూ.5 వేల కోట్లు పెడితే సరిపోతోందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రైవేటీకరణకు అడుగులు వేస్తున్నారని విమర్శించారు. రూ.8 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వడం దోచుకునేందుకేనని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే న్యాయపరంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతిపత్రం అందజేసి ప్రైవేటీకరణ సమస్యలను విన్నవించారు. నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా జాయింట్ సెక్రటరీలు దివాకర్‌రెడ్డి, గౌమతి, ఉదయ్‌భాను, చిత్తూరు నియోజకవర్గం అధ్యక్షులు చక్రవర్తిరెడ్డి, జీడీ నెల్లూరు నియోజకవర్గం జాయింట్ సెక్రటరీ హరిబాబు, పలమనేరు నియోజకవర్గం అధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డి, సెక్రెటరీలు కృష్ణమూర్తి, ఇషాద్, నగరి నియోజకవర్గం అధ్యక్షులు బాబు, సెక్రెటరీ నాగరాజు, మెంబర్ తిరుమలయ్య, పలమనేరు కార్పొరేషన్ లీగల్ సెల్ మెంబర్ హరికృష్ణారెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

లోన్ మంజూరైందంటూ ఘరానా మోసం

- ఖాతాలోని రూ.50 వేలు దోచేసిన ఘనుడు
- లబోదిబోమంటున్న బాధితుడు




ధని ఫైనాన్స్ మేనేజరుగా పంపిన విజయరావు గుర్తింపు కార్డు, ఆధార్

చౌడేపల్లె : ఫోన్ చేసి హలో.. మీకు రూ.5 లక్షల లోన్ మంజూరైందని మాటలతో బురిడీ కొట్టి రూ.50 వేలు సొమ్ము కాజేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు రవి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు ఇలా.. చౌడేపల్లె మండలం 29 ఏ చింతమాకులపల్లెకు చెందిన డి. కృష్ణప్ప కుమారుడు రవికి శుక్రవారం 8601605396 నంబరుతో ఫోన్‌లో 'ధని ప్రవేటు ఫైనాన్స్ కంపెనీ మేనేజరు విజయరావు మాట్లాడుతున్న.. మీకు లోన్ మంజూరైంది, అది జమ కావాలంటే తొలుత కొంత సొమ్ము చెల్లించాలని కోరాడు'. రవిని నమ్మించడానికి విజయరావు ఫైనాన్స్ మేనేజరు ఐడీ , ఆధార్ కార్డులను వాట్సాప్‌నకు పంపించడంతో నిజమేనని నమ్మిన రవి తొలుత రూ.20 వేలు, తరువాత రూ.30 వేలు చెల్లించేశాడు. ఎంతసేపటికీ తనకు రూ.5 లక్షలు లోన్ సొమ్ము ఖాతాకు జమ కాకపోవడం, తనకు వచ్చిన ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో మోసపోయాయని గ్రహించిన బాధితుడు లబోదిబోమంటూ గుండెలు బాదుకున్నాడు. చివరికి ఇది సైబర్ నేరగాళ్ల పనిగా గుర్తించి పోలీసులను ఆశ్రయించనున్నట్లు తెలిపాడు.

పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యం

– 2 కే రన్ ప్రారంభించిన ఎంపీ


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు కలెక్టరేట్ : పర్యాటక రంగం అభివృద్ధి రాష్ట్రానికి అవసరమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని శనివారం పర్యాటక దినోత్సవం నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి మెసానికల్ మైదానం వరకు 2 కే రన్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందితే స్థానికంగా ఉపాధితో పాటు ప్రజలకు రాష్ట్రానికి ఆదాయం చేకూరుతుందన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి నరేంద్ర మాట్లాడుతూ.. ప్రపంచంలో పర్యాటక ప్రదేశాల గుర్తింపు, పరిరక్షణ, చారిత్రక కట్టడాల పరిరక్షణకు సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, సమగ్రశిక్షా శాఖ ఏపీసీ వెంకటరమణ, సీఐ మహేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన గోవిందరాజులగుట్ట


శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : పెరటాసి నెలను పురస్కరించుకుని చిత్తూరు మండలం టి.వేపనపల్లి సమీపంలోని గోవిందరాజుల గుట్టకు శనివారం జనం పోటెత్తారు. గుట్టలోని శ్రీవారి పాదాలకు క్షీరాభిషేకం చేశారు. చుట్టూ పక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో తాళంబేడు సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, సభ్యులు సోమనాథరెడ్డి, నంద గోపాల్‌నాయుడు, మధుబాబు, గోవింద రాయుడు, శ్రీరాములు, నీరాజాక్షులునాయుడు, అర్చకులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చిత్తూరు నగరంలోని శ్రీవేంకటేశ్వస్వామి ఆలయంలో కూడా భక్తులు కిక్కిరిశారు. గోవింద నామస్మరణలతో మార్మోగించారు. అనంతరం స్వామివారిని నగర వీధుల్లో ఊరేగించారు.

పీవీకేఎన్‌లో పీజీ స్పాట్ అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్‌లకు అవకాశం కల్పించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాలలో పీజీ కోర్సుకు 2025–26 విద్యాసంవత్సరానికి గాను స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో అడ్మిషన్లు చేసుకుంటున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు సంబంధిత సబ్జెక్టులలో ఓసీ, బీసీలు 55 శాతం డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం ఉత్తీర్ణత పొంది ఉండాలని తెలిపారు. పీజీ ఎంట్రన్స్ రాసిన వారు, రాయని వారు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులన్నారు. ఇతర వివరాలకు 9985957572, 9703799970 సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

అధికారాన్ని అడ్డంపెట్టుకొని..

- వీఆర్‌ఏ ఉద్యోగం భర్తీలో చక్రం తిప్పిన అధికారి
- చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఓ ఉద్యోగి భార్యకు కట్టబెట్టిన వైనం
- రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- విచారణలో అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ప్రభుత్వ శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం భర్తీ చేయాలన్న సవాలక్ష ఆంక్షలుంటాయి. నోటిఫికేషన్, పరిశీలన, మెరిట్‌లిస్టు, ఫైనల్ మెరిట్ లిస్టు అంటూ నిబంధనలు అన్నీ ..ఇన్నీ కావు. అయితే ఓ ప్రభుత్వ ఉద్యోగాన్ని అంగట్లో సరుకులా కొనేశారు. ఆ అధికారి రాజు కావడంతో వీఆర్‌ఏ పోస్టు పరిపూర్ణంగా సమాప్తమైంది. ఇదంతా చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. ఇక్కడ ఓ అధికారి తహసీల్దార్, డీటీలను పక్కనపెట్టి కార్యాలయాన్ని గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. స్థాయి మరిచి పని చేస్తున్నారు. బాధ్యతలను వదిలి ఇతర పనులపై దృష్టి సారిస్తున్నారు. వీఆర్వోలను అరచేతిలో పెట్టుకుని అధికారాన్ని శాసిస్తున్నారు. ఇంకొంత మంది సహాయకులుగా నియమించుకుని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

వీఆర్‌ఏ పోస్టుపై కన్ను

చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయ పరిధిలోకి ఓ కొత్త వీఆర్‌ఏ నియమితులయ్యారు. ఆమె వచ్చాక కార్యాలయం మొత్తం షాక్‌లో పడింది. ఇదేలా అంటూ అవాక్కువుతున్నారు. ఈపోస్టు తన భార్యకు ఎలా చేశారు? ఎలా ఇచ్చారు? ఇందుకు ఎవరెవ్వరూ సహకరించారు? ఎంత ఇచ్చుకున్నారు. వీఆర్‌ఏ పోస్టు భర్తీకి ఇచ్చిన పత్రాలు నకిలీవా అనే అనుమానాలు పుట్టుకొచ్చాయి. ఏకంగా కొత్త వీఆర్‌ఏకు డ్యూటీలు సైతం ఇవ్వడంతో అంతా ఆ అధికారిపై గుర్రు మంటున్నారు. జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రస్తుతం ఆర్డీఓ విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. దీంతో ఆ అధికారి పలు కారణాలను చూపి తనకు నాకు.. ఎలాంటి సంబంధంలేదని చెబుతున్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్ : ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. చిత్తూరు నగర శివారులోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం సమీపంలో ఈనెల 6వ తేదీన ఓ ద్విచక్రవాహనం ఢీ కొని, దాదాపు 62 ఏళ్ల వయస్సున్న వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా, శనివారం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 94910 74515 , 70135 54201 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

తాళాలు పగులగొట్టి నగలు చోరీ

పుంగనూరు : గుడికి వెళ్లి వచ్చేలోపు ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు రూ.20 లక్షలు విలువ చేసే నగలు, నగదును దోచేసిన ఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని బజారువీధిలో నివాసం ఉన్న రాధాకృష్ణయ్యశెట్టి కుటుంబ సభ్యులతో కలిసి గుడికి వెళ్లి ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి చూడగా ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి 150 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి వస్తువులు, రూ.40 వేలు నగదు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాలను ఢీ కొట్టిన కారు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో ఓ వ్యక్తి కారుతో అతివేగంతో వచ్చి.. మరో రెండు వాహనాలను ఢీ కొట్టాడు. శనివారం కట్టమంచి వద్ద ఢిల్లీ రిజిస్ట్రేషన్ నంబరుతో అతి వేగంతో వస్తున్న కారు.. ఎదురుగా వస్తున్న మరో కారును ఢీ కొట్టింది. ఆపై ఆటోను ఢీ కొట్టి, ఓ పాదచారిని సైతం ఢీ కొట్టారు. కారులో ఉన్న పిల్లలకు స్వల్ప గాయాలు కాగా పాదచారి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. గాయపడ్డ వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ట్రాఫిక్ పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలకమండలిలో బీజేపీకి అన్యాయం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ప్రధాన ఆలయాల పాలక మండలి నియామకాల్లో బీజేపీకి తీవ్ర అన్యాయం జరుగుతోందని బీజేపీ నాయకులు విమర్శించారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు రామభద్ర మాట్లాడుతూ.. చిత్తూరు నగరంలోని ప్రధాన ఆలయాల్లో పాలక మండలి ఏర్పాటు నియామకంలో తమ పార్టీకి చెందిన నాయకులకు చైర్మన్ పదవులు అడగలేదన్నారు. కనీసం పాలక మండలి సభ్యులుగా పదవులు ఇవ్వాలని కోరామన్నారు. అయితే బీజేపీ తరపున చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయానికి పంపిన ప్రతిపాదనలపై ఇంత వరకు అతీగతీ లేదన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఏం జరుగుతుందో ఆయనకే తెలియాలని ఆవేదన చెందారు. ఎమ్మెల్యే సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి తమ పార్టీకి జరుగుతున్న అన్యాయంపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో చిత్తూరు సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం, తోటపాలెం వెంకటేష్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.